వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

TGTEL/25/A4812

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 74 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శనివారం | జూన్ 27, 2026




2లో..

## ఆర్టీసీ కార్మికుల హామీలన్నీ నెరవేరుస్తాం

- వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు తగదు
- జూలై జీతాల నుంచే 11 శాతం పీఆర్సీ అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

## ముగ్గురు సీఎంల మధ్య ‘చీకటి ఒప్పందం’?

- తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు
- సీఎం కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ ఒప్పుకోదు
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన ‘చీకటి ఒప్పందాలు’ ఏమిటో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలో ముగ్గురు సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను సైతం లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో ‘నవేలి’, ఏపీలో ‘గుండ్రేవుల’ ప్రాజెక్టులు కడతామంటుంటే.. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడే తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా? అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అనుమతుల తులనాత్మక పరిశీలన: గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని స్పష్టం చేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చేయడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన ‘నీరో చక్రవర్తి’ స్ఫూర్తి అనిపిస్తోందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. “గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ‘ముంపు మేస్త్రి’ కావొద్దు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోంది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదు.. తస్మాత్ జాగ్రత్త!” అని తన్నీరు హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని, రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో దీనిపై పోరాడుతామని హరీష్ రావు హెచ్చరించారు.

## తక్కువ ధరకు బంగారం అంటూ భారీ మోసం

‘గోల్డ్ మ్యాన్’ సూర్యాభాయ్ అరెస్ట్

షాద్‌నగర్‌లో పట్టుకున్న పోలీసులు



4లో..




2లో..

## గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండండి

- ప్రాణ, పంట నష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరం సుందరంగా తీర్చిదిద్దాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## రెండేళ్లలో 500 నగరాలకు ‘భారత్ ట్యాక్సీ’ సేవలు!

గుజరాత్‌లో సహకార రవాణా వ్యవస్థను ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

ప్రైవేట్ యాప్‌ల శ్రమదోపిడీకి అడ్డుకట్ట..

డ్రైవర్లే ఈ సంస్థకు యజమానులు



2లో..

## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

- ‘ఈ-ఆటోల’ను ప్రారంభించిన మంత్రి సీతక్క
- మానవత్వం లేనివారే అసలైన దివ్యాంగులు



2లో..

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath

VOICE OF
VANDE BHARATH

శనివారం, జూన్ 27, 2026

# ఆర్టీసీ కార్మికుల హామీలన్నీ నెరవేరుస్తాం

- వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు తగదు
- జూలై జీతాల నుంచే 11 శాతం పీఆర్సీ అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లలో యాజమాన్యం పరిధిలోని 29 డిమాండ్ల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం పీఆర్సీని జూలై నెల జీతాల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించారు. కొన్ని కార్మిక సంఘాల నాయకులు రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించడం బాధాకరమన్నారు. గత సమ్మె సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం.. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ సెక్రటరీ దానా కిషోర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితర ఉన్నతాధికారులతో కలిసి దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో 14 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన గుర్తింపు సంఘాల ఎన్నికలు, పీఆర్సీ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి తెలిపారు. కార్మికుల మొదటి డిమాండ్ అయిన గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. విలీన ప్రక్రియలో కార్మిక ప్రతినిధులు: ఆంధ్రప్రదేశ్ తరహాలో విలీనం తర్వాత ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలనేదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. విలీన విధివిధానాల రూపకల్పన కమిటీలో కార్మిక ప్రతినిధులు ఉండాలని నిర్ణయించామని, వారు గుర్తింపు పొందిన సంఘం నుంచే ఉండాలి కాబట్టే ముందుగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. "మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చాలని భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో కొంతమంది నాయకులు ఎన్నికలు జరగకుండా, విలీనాన్ని వివాదాస్పదం చేయాలని చూడటం సరికాదు. కార్మికులు అసత్య ప్రచారాలను నమ్మవద్దు." అని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, చిత్తశుద్ధితో కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తోందని, భవిష్యత్తులో ఆర్టీసీ విలీనం వల్ల ఎవరికీ నష్టం జరగకుండా ఉండేందుకే ఈ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని మంత్రి పునరుద్ఘాటించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు 'భారత్ ట్యాక్సీ' సేవలు!

- గుజరాత్‌లో సహకార రవాణా వ్యవస్థను ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- ప్రైవేట్ యాప్‌ల శ్రమదోపిడీకి అడ్డుకట్ట..
- డ్రైవర్లే ఈ సంస్థకు యజమానులు




**గాంధీనగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే రెండేళ్ల కాలంలో దేశంలోని 500కు పైగా నగరాలకు 'భారత్ ట్యాక్సీ' సేవలను విస్తరించనున్నట్లు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. శనివారం గుజరాత్‌లోని గాంధీనగర్ వేదికగా 'భారత్ ట్యాక్సీ' రవాణా సేవలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. పూర్తి సహకార విధానంలో, డ్రైవర్ల భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఈ సరికొత్త యాప్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రస్తుత రోజుల్లో ట్యాక్సీ సేవలు నిత్యావసరంగా మారాయని పేర్కొన్న అమిత్ షా.. కార్పొరేట్ రన్ ప్రైవేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతిలో డ్రైవర్లపై చేస్తున్న శ్రమదోపిడీని అడ్డుకోవడానికే 'భారత్ ట్యాక్సీ'ని రంగంలోకి తెచ్చామన్నారు. ఈ వ్యవస్థలో రవాణా ఆపరేటర్లను డ్రైవర్లని పిలవడం కంటే 'సారథులు' అని పిలవడానికే తాను ఇష్టపడతానని చెప్పారు. ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్స్ అధిక శాతం లాభాలను తామే దండుకుంటూ, వర్కర్లను వేధిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయని అమిత్ షా విమర్శించారు. భారత్ ట్యాక్సీలో ఎలాంటి శ్రమదోపిడీ ఉండదని, ఇందులో చేరిన ప్రతి ఒక్క సారథి ఈ సంస్థకు వాటాదారుడిగా, యజమానిగా ఉంటారని హామీ ఇచ్చారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములై సుస్థిర ఆర్థిక భద్రతను పొందారని తెలిపారు. బైక్ ట్యాక్సీల ప్రాధాన్యత: ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని.. ద్విచక్ర వాహనాలు సైతం కుంభమేళా వంటి భారీ ఈవెంట్స్‌లో 'బైక్ ట్యాక్సీలు'గా ప్రజా రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గుర్తుచేశారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రత్యర్థి కంపెనీలు చేస్తున్న ప్రచారాన్ని హోం మంత్రి తీవ్రంగా కొట్టిపారేశారు. ఈ కొత్త యాప్‌ను మార్కెట్ నుంచి ఎలాగైనా తప్పించాలనే కుట్రతోనే ప్రైవేట్ యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తాత్కాలికంగా తగ్గిస్తున్నాయని ఆరోపించారు. "పోటీ కంపెనీలు వ్యూహాత్మకంగా ధరలు తగ్గించి మమ్మల్ని అడ్డుకోవాలని చూస్తున్నాయి. కానీ వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? 'భారత్ ట్యాక్సీ' అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు.. నిలిచి పోరాడుతుంది, విజయం సాధిస్తుంది. ఈ వ్యవస్థ దీర్ఘకాలిక ప్రయోజనాలకు సారథులు, వినియోగదారుల మద్దతే కీలకం." అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. గతంలో డైరీ రంగంలో అముల్, ఎరువుల రంగంలో ఇఫ్కో వంటి సహకార సంస్థలు సాధించిన అసాధారణ విజయాలనైనాన్ని ఈ సందర్భంగా అమిత్ షా గుర్తుచేశారు. అదే పద్ధతిలో భారత్ ట్యాక్సీ కూడా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, సహకార సంఘాల ప్రతినిధులు, వేలాది మంది రవాణా సారథులు పాల్గొన్నారు.

# 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా



- 'ఈ-ఆటోల'ను ప్రారంభించిన మంత్రి సీతక్క
- మానవత్వం లేనివారే అసలైన దివ్యాంగులు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని దివ్యాంగులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 14 నైబర్‌హుడ్ సెంటర్లకు దివ్యాంగులను ఉచితంగా చేరవేసేందుకు వీలుగా ప్రత్యేక 'ఈ-ఆటోల' పంపిణీని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం ప్రారంభించారు. హెలెన్ కెల్లర్ జయంతిని పురస్కరించుకుని ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం శుభపరిణామమని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని, వారి సర్వాంగీణ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు.వైకల్యం అనేది కేవలం శారీరక లోపం మాత్రమేనని, దానిని చూసి ఎవరూ అధైర్యపడకూడదని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. "సమాజంలో మానవత్వం లేనివారే అసలైన దివ్యాంగులు. ఇతరులను కించపరిచేలా ప్రవర్తించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చే లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం తోడ్పాటుతో సులభంగా అధిగమించవచ్చు. చూపు, వినికిడి లోపించినప్పటికీ హెలెన్ కెల్లర్ ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచారు." అని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులను తక్కువ చేసి చూడకుండా, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధించగలరని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన బ్రెయిలీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎంతో మంది దివ్యాంగులు తమ ఉన్నత లక్ష్యాలను చేరుకుంటున్నారని గుర్తుచేశారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండండి

- ప్రాణ, పంట నష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరం సుందరంగా తీర్చిదిద్దాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే వర్షాకాలంలో గోదావరి వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా సంబంధిత అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గోదావరి వరదల ముందస్తు ప్రణాళికపై నిర్వహించిన జిల్లా స్థాయి ఉన్నత సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోదావరి పరివాహక ప్రాంతాలైన భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరద ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేశామని వెల్లడించారు. వరదల సమయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గతంలో సంభవించిన వరదల అనుభవాలను మరియు నష్టాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల సూచించారు. వరద తాకిడి వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే (బ్లాక్ అయ్యే) ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. సదరు గ్రామాల్లో అత్యవసర వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందస్తు 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాద్రి జిల్లాతో పాటు గోదావరి తీర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కంట్రోల్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. "ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి." అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, మేయర్ ముల్లాడి గణేష్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనులు వేగవంతం

- ప్రభుత్వ విప్, సెక్రటరీ శైలజ, కలెక్టర్ గరిమ
- మరో వెయ్యేళ్ల పాటు నిలిచేలా అత్యాధునిక శిల్పకళతో అభివృద్ధి
- బద్ది పోచమ్మ ఆలయ పనుల పరిశీలన



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు అత్యంత వేగంగా పూర్తి అవుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాజన్న ఆలయంతో పాటు బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. శృంగేరి పీఠాధిపతి సూచనలు, ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా విస్తరణ పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. ఇప్పటివరకు దాదాపు 35 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆలయ విస్తరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, ఒక్కో విభాగానికి ఒక్కో గడువు పెట్టుకుని ముందుకు వెళ్తున్నట్లు విప్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, ఇతర మంత్రుల సహకారంతో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనివిుటి మండపంలో భాగంగా అద్దాల మండపం, బ్రాహ్మణ సత్రం, నిత్య అన్నదాన సత్రం తదితర నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. భవిష్యత్తులో మరో 1000 సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని రాతి శిలలు, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. వేములవాడ పట్టణాన్ని, ఆలయాన్ని సమపాళ్లలో అభివృద్ధి చేస్తామని.. ఇందులో భాగంగా రూ. 47 కోట్లతో రోడ్డు విస్తరణ, రూ. 6 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.20 కోట్లతో బద్ది పోచమ్మ దేవాలయాన్ని నిర్మిస్తున్నామని, నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే ఎయిర్ ఫోర్స్ విమానాన్ని అక్కడ ఏర్పాటు చేసినట్లు వివరించారు. "అంతరాలయం ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉంటుంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సకల సౌకర్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా నిర్మిస్తున్నాం. త్వరలోనే పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన దర్శనం కల్పిస్తాం." అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది (2025) నాటికి ఆలయ విస్తరణ పనులన్నీ పూర్తి చేసి భక్తులకు స్వామివారి దర్శనం కలిగేలా కసరత్తు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విప్ ఆది శ్రీనివాస్ సూచనల ప్రకారం పనులు జరుగుతున్నాయని, మరికొన్ని అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం భక్తులకు భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు, దర్శనాలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేవస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ పాల్గొన్నారు.

# నాపై ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

- మల్కపేట సర్పంచ్ బోయిని దేవరాజు
- లీకైన వీడియో వెనుక అసలు నిజాలు వెల్లడి..
- రాజకీయ బురదజల్లేందుకేనని ధ్వజం



**వేములవాడ/కోనరావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేత చెలిమడ లక్ష్మీనరసింహారావు సొంత గ్రామంలో నేను కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్‌గా గెలవడమే నేను చేసిన పాపమా?" అని కోనరావుపేట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, మల్కపేట గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు ప్రశ్నించారు. ఒక యువకుడిగా తాను ప్రజల్లో ఎదుగుతుండటాన్ని ఓర్వలేకనే బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ చంద్రయ్య తనపై కుట్రలు పన్నుతూ అసత్య ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యపు అక్రమ రవాణా వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను దేవరాజు తీవ్రంగా ఖండించారు. వేములవాడ పట్టణంలోని బింగి మహేష్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు షేక్ ఫిరోజ్ పాషా, చేపూరి గంగాధర్, ప్యాక్స్ చైర్మన్ బండ నరసయ్య, పలు గ్రామాల కాంగ్రెస్ సర్పంచులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడించారు. మల్కపేట గ్రామం నుంచి సుమారు 89 బస్తాల లోడుతో వెళ్తున్న ఒక లారీని పోలీసులు పట్టుకున్న క్రమంలో, గ్రామానికి చెందిన బుట్టం ప్రభాకర్ అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతోనే తాను ప్రజాప్రతినిధిగా సాయంత్రం 6:24 గంటలకు ఘటనా స్థలానికి వెళ్లినట్లు దేవరాజు స్పష్టం చేశారు. బాధితుడి తరఫున పోలీసులతో మాట్లాడటం మినహా తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. "అక్కడ ఏం జరుగుతుందో సాక్ష్యాధారాలు ఉండాలనే ఉద్దేశంతో తానే స్వయంగా వీడియో తీయించానని, ఆ వీడియో ఫుటేజీని బయటపెట్టింది కూడా నేనేనని వివరించారు. నిజాలు ఇలా ఉంటే, బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు." అని మల్కపేట సర్పంచ్ బోయిని దేవరాజు అన్నారు. ప్రస్తుతం దొంగతనం కేసులో జైలుకు వెళ్లిన జంగిటి శ్రీనివాస్ అనే వ్యక్తితో తనకు ఎలాంటి వ్యాపారాలు గానీ, ఆర్థిక లావాదేవీలు గానీ లేవని ఖరాఖండిగా చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించాల్సిందేననే ఉద్దేశంతోనే సదరు వ్యక్తిని రిమాండ్‌కు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. రాజకీయంగా తనను తొక్కేయడానికి బీఆర్ఎస్ నాయకులు జైలుకు వెళ్లిన వ్యక్తి తల్లి వద్దకు వెళ్లి పది లక్షల రూపాయల ఆశ చూపిస్తూ, తనపై తప్పుడు ఆరోపణలు చేయాలని ప్రలోభపెడుతూ కుట్రలు పన్నుతున్నారని దేవరాజు ఆరోపించారు. మల్కపేట గ్రామ సర్పంచ్‌గా తాను ఏ చిన్న తప్పు చేసినట్లు నిరూపించినా, ఏ శిక్షకైనా అర్హుడినేనని, తన పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. మాజీ ఎంపీపీ చంద్రయ్యకు అంతటి నిజాయితీ ఉంటే మల్కపేట ప్రజా క్షేత్రంలోకి వచ్చి తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఒక సంచలన ఆడియో కాల్ రికార్డు కూడా వెలుగుచూడటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈ ఉదంతం తీవ్ర సంచలనంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు ఆడుతున్న ఈ రాజకీయ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని దేవరాజు అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడు బంకించంద్ర ఛటర్జీ



**వేములవాడ,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిలూది, ప్రజల్లో అపారమైన దేశభక్తిని రగిలించిన మహనీయుడు బంకించంద్ర ఛటర్జీ అని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ కొనియాడారు. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ 188వ జయంతి సందర్భంగా శనివారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రముఖ బెంగాలీ నవలా రచయిత, కవి, జర్నలిస్ట్ అయిన బంకించంద్ర ఛటర్జీ 1838 జూన్ 27న పశ్చిమ బెంగాల్‌లోని నైహతి సమీపంలో జన్మించారని తెలిపారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి మొట్టమొదటి పట్టభద్రులలో ఒకరైన ఆయన, ప్రెసిడెన్సీ కాలేజీ నుండి బి.ఎ, ఆ తర్వాత న్యాయశాస్త్రం పూర్తి చేశారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వంలో డిప్యూటీ మేజిస్ట్రేట్ మరియు డిప్యూటీ కలెక్టర్‌గా సుమారు మూడు దశాబ్దాల పాటు సేవలు అందించారని గుర్తుచేశారు. ఆధునిక బెంగాలీ సాహిత్య వికాసానికి ఎనలేని కృషి చేసిన ఆయనను 'సాహిత్య చక్రవర్తి' అని పిలుస్తారని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బెంగాలీ సాహిత్య పునరుజ్జీవనం కోసం 1872లో 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికను స్థాపించారని, ఆయన రాసిన 'ఆనందమఠం' నవల భారతీయ సాహిత్య చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిందని వివరించారు. సరికొత్త సాహిత్య ఒరవడిని సృష్టించి, దేశ స్వేచ్ఛ కోసం కలం పట్టిన బంకించంద్ర ఛటర్జీ 1894 ఏప్రిల్ 8న కలకత్తాలో కన్నుమూశారని ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవంతమైన 'మెగా సర్జికల్ క్యాంప్'

## ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై తనకున్న ప్రత్యేక బాధ్యతను చాటుకుంటూ, అచ్చంపేట పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నాల్గవ విడత "మెగా సర్జికల్ క్యాంప్" ఘనంగా నిర్వహించబడింది. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా వందలాది మంది పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించారు. రాజకీయ నాయకుడిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తనలోని వైద్య వృత్తి పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటూ.. పేద ప్రజల ఆరోగ్య కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. నిపుణులైన వైద్యులతో ఎంతో మంది పేద రోగులకు శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) విజయవంతంగా పూర్తి చేయించి, వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారు. కేవలం ఆపరేషన్లు నిర్వహించడమే కాకుండా, ఈరోజు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్వయంగా ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న ప్రతి ఒక్క రోగిని పేరుపేరునా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు "నేను ఉన్నాను" అంటూ కొండంత మనోధైర్యాన్ని, నమ్మకాన్ని కల్పించారు. "వైద్యో నారాయణో హరిః" అనే నానుడిని నిజం చేస్తూ.. అటు ప్రజాప్రతినిధిగా నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, ఇటు వైద్యుడిగా పేదల ప్రాణాలు కాపాడుతున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మానవతా దృక్పథం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్యాంప్ ద్వారా లబ్ధి పొందిన పలువురు రోగులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, జూన్ 27, 2026

# రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

## ముగ్గురికి తీవ్ర గాయాలు



**బల్మూరు/అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం బల్మూరు మండలం అనంతవరం గ్రామ సమీపంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ (45) మరో వ్యక్తితో కలిసి బైక్‌పై అచ్చంపేటకు బయలుదేరారు. అదే సమయంలో అచ్చంపేట వైపు నుండి లింగాల మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి మరో ప్రయాణికుడితో కలిసి టీవీఎస్ ఎక్సెల్ పై వస్తున్నారు. ఈ క్రమంలో అనంతవరం గ్రామ సమీపంలోని ఓ ప్రమాదకర మూలమలుపు వద్దకు రాగానే రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనంతవరం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే స్పృహతప్పారు. స్థానికులు వెంటనే స్పందించి 108 అత్యవసర వాహనంలో ఆయనను అచ్చంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ ప్రథమ చికిత్స అందిస్తున్న క్రమంలోనే శ్రీనివాస్ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మిగతా ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో, వారికి ప్రస్తుతం అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలోనే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదకరమైన ఆ మూలమలుపు వద్ద వేగ నియంత్రణ లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

# 'రెండు చుక్కలు-నిండు జీవితానికి రక్ష'

- 1.00 లక్షల మంది చిన్నారులే లక్ష్యం
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సర్వం సిద్ధం..
- పల్స్ పోలియో అవగాహన ర్యాలీ ప్రారంభం




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.కృష్ణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పల్స్ పోలియో కార్యక్రమ విస్తృత ప్రచారంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. "రెండు చుక్కలు నిండు జీవితానికి రక్ష", "పోలియోను తరిమిద్దాం– పిల్లల బంగారు భవిష్యత్తుకు బాట వేద్దాం" అనే నినాదాలతో వైద్య సిబ్బంది ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. ఆదివారం జిల్లాలోని 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 613 బూత్‌లలో, 18 బస్టాండ్ కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఈ పోలియో బూత్‌లను ప్రారంభించాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు సంవత్సరాల లోపు ఉన్న 1,00,624 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 1,17,500 డోసుల పోలియో వ్యాక్సిన్‌తో పాటు పోస్టర్లు, బ్యానర్లు, మార్కర్లను ఇప్పటికే 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. పారదర్శక నిర్వహణ కోసం 61 మంది పర్యవేక్షణ సిబ్బందిని నియమించారు. వలస కుటుంబాలు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, నిర్మాణ రంగాల్లోని 642 మంది చిన్నారుల కోసం 28 ప్రత్యేక మొబైల్ బృందాలను రంగంలోకి దించారు. "ఆదివారం బూత్‌లకు రాలేకపోయిన చిన్నారుల కోసం జూన్ 29, 30 తేదీలలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు. చిన్నారులందరికీ చుక్కలు వేయించేలా స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి." అని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాకరణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, పలువురు ప్రోగ్రాం అధికారులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ కాంప్లెక్స్ దుకాణాలు దళిత నిరుద్యోగులకే కేటాయించాలి

- లక్కీ డిప్ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలి




**అచ్చంపేట/కల్వకుర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను అర్హులైన నిరుపేద దళిత నిరుద్యోగులకే కేటాయించాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా, అనర్హులకు దుకాణాలు కేటాయించడాన్ని నిరసిస్తూ అర్హులైన దళిత నిరుద్యోగులు గత రెండు రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బిఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ యూనిట్ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బిఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎట్టి ఆంజనేయులు మాట్లాడుతూ.. దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న 250 మంది అభ్యర్థుల పేర్లను పారదర్శకంగా చిట్టీల (లక్కీ డిప్) రూపంలో తీసి కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది బంధువులకే ఈ దుకాణాలను కేటాయించారని ఆరోపించారు. ఏళ్ల తరబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిజమైన దళిత అభ్యర్థులను పక్కన పెట్టి, కేవలం రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. "ప్రస్తుతం జరిగిన అక్రమ కేటాయింపులను వెంటనే రద్దు చేయాలి. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిరుద్యోగులకు న్యాయం చేయాలి. డిమాండ్లు నెరవేరకపోతే అన్ని పార్టీలను కలుపుకొని ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం." అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు నిరటి మల్లన్న, గోరటి వెంకన్న, కేశవులుతో పాటు బిఎస్పీ జిల్లా నాయకులు కళ్యాణ్, శ్రీను, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకు బంగారం అంటూ భారీ మోసం

- 'గోల్డ్ మ్యాన్' సూర్యాభాయ్ అరెస్ట్
- షాద్‌నగర్‌లో పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తక్కువ ధరకే విదేశీ బంగారం ఇప్పిస్తానంటూ నమ్మించి, అమాయకులను ముంచేస్తున్న కేటుగాడు, 'గోల్డ్ మ్యాన్' సూర్యాభాయ్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. మోసపోయిన బాధితులు నిలదీయడంతో, అరెస్ట్ భయంతో హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా నిందితుడిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాభాయ్ తక్కువ ధరకే విదేశీ బంగారం అందిస్తానంటూ అమాయకులను నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ భారీ మోసాలకు తెరతీశాడు. ఈ క్రమంలో అతని మాటలు నమ్మిన హిమాయత్‌నగర్, నీలోఫర్ ప్రాంతాలకు చెందిన కొందరు బాధితులు సుమారు రూ. 30 లక్షల నగదును సూర్యాభాయ్‌కి అందజేశారు. నగదు ఇచ్చి ఎంతకాలం గడుస్తున్నా సూర్యాభాయ్ బంగారం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు అతని ఇంటికి వెళ్లారు. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని గట్టిగా నిలదీశారు. దీంతో తప్పించుకునే మార్గం లేక సూర్యాభాయ్ తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను బాధితులకు ఇచ్చి, వాటి విలువ రూ. 10 లక్షలు ఉంటుందని నమ్మించాడు. మిగతా రూ. 20 లక్షల మొత్తానికి ఓ చెక్కును ఇచ్చి వారిని పంపించేశాడు. అయితే ఆ చెక్కు కాస్తా బ్యాంకులో బౌన్స్ అయ్యింది. బాధితులు మళ్లీ ఒత్తిడి తీసుకురావడంతో సూర్యాభాయ్ ఏకంగా సీన్ రివర్స్ చేశాడు. తానే బాధితుడినంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితులు తన ఇంటికి వచ్చి తనను బెదిరించి, బలవంతంగా ఐఫోన్లు లాక్కెళ్లారంటూ వారిపైనే తప్పుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై అత్తాపూర్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అసలు నిగూఢ నిజాలు వెలుగులోకి వచ్చాయి. తక్కువ ధరకు బంగారం పేరుతో సూర్యాభాయే బాధితులను మోసం చేసినట్లు ప్రాథమికంగా తేలడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేసు నమోదైందని తెలుసుకున్న సూర్యాభాయ్ నగరం నుంచి చెక్కేసేందుకు ప్రయత్నించగా, గాలించిన పోలీసులు షాద్‌నగర్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇతని చేతిలో ఇంకా ఎవరెవరు మోసపోయారనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో ఇష్టారాజ్యంగా పుస్తకాల విక్రయం

- 'కృష్ణవేణి టాలెంట్ స్కూల్' బుక్ రూమ్‌ను సీజ్ చేసిన ఎంఈఓ
- విద్యార్థి సంఘాల తనిఖీలతో వెలుగు చూసిన అక్రమాలు




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టానుసారంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వ్యవహారం కలకలం రేపింది. శనివారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థి సంఘాల నాయకులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లో ఈ అక్రమ విక్రయాల భాగోతం వెలుగుచూసింది. దీనిపై సమాచారం అందుకున్న ఎంఈఓ శ్రీనివాసమూర్తి తక్షణమే పాఠశాలకు చేరుకొని, పాఠ్యపుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమించి ప్రైవేట్ యాజమాన్యాలు పాఠశాలల్లోనే వ్యాపార కేంద్రాలుగా మార్చుకొని పుస్తకాలు, దుస్తులు అమ్ముతూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. "అచ్చంపేట పట్టణంలో కొనసాగుతున్న అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టాలి. పాఠశాల ప్రాంగణాల్లో ఎలాంటి పుస్తకాల విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీలు, నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మహేష్, బీసీ సంఘం నాయకులు అనిల్, యూఎస్ఎఫ్ఐ నాయకులు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.